సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 27 । ఏప్రిల్ । 2025




మట్టి మాఫియా ఆగడాలపై నిరసన

ఆచంట వేమవరం, ఆంచట శివారు నక్కల కాలువ, గుమ్ములూరు రాయగొప్ప నక్కల కాలువలో మట్టి మాఫియా తవ్వకాలను సీపీఎం బృందం శనివారం పరిశీలించింది. IIలో ▸



'శ్రీవారి చెంత' సేద తీరి

చిన్నవెంకన్న ఆలయంలో ఎయిర్ కూలర్లు ఏర్పాటు చేశారు. వేసవి దృష్ట్యా దాతల సహకారంతో ఏర్పాటు చేసిన కూలర్లు సౌకర్యవంతంగా ఉన్నాయి. IIలో ▸



నరికిన చెట్ల కలప సంగతేంటి.?

ద్వారకాతిరుమల మండలంలో పోలవరం కాలువ గట్టుపై భారీ చెట్లను అడ్డగోలుగా నరికేశారు. చెట్ల కలప సంగతిని అధికారులు ఇంతవరకూ తేల్చలేదు. IIలో ▸

నర్సింగ్ విద్యార్థినులకు
వసతి వెతలు

- నెలకు రూ.3 వేలతోనే నెట్టుకొస్తున్న వైనం
- 550 మందికి రూ.19 లక్షల స్టైఫండ్ బకాయిలు
- ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఇక్కట్లు

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆస్పత్రిలో జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ (జీఎన్ఎం), బీఎస్సీ నర్సింగ్ విద్య అభ్యసిస్తున్న పేద వర్గాల బాలికలకు వసతి, ఇతర అవసరాలకు అన్ని విధాల ఆర్థిక సాయం చేస్తున్నామని సర్కారు చెబుతున్నా.. వాస్తవం మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది. గత పదేళ్ళుగా ప్రభుత్వం జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ కాలేజీల్లో విద్యార్థినులకు నర్సింగ్ విద్య ఉచితమంటూనే.. అరకొర స్టైఫండ్‌తో గడిపేస్తుంది. ప్రభుత్వం ఇచ్చే కొద్ది మొత్తంతో నెట్టుకురావాల్సి ఉండడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆర్థిక భారంతో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయకుండా గాలికి వదిలేస్తోందని, పేద పిల్లలకు కనీసం నిధులు కేటాయించే పరిస్థితి లేకపోవటం దారుణమని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చదువుతున్న 550 మందికి పైగా నర్సింగ్ విద్యార్థినులకు రూ.19 లక్షల స్టైఫండ్ బకాయిలు ఉండడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

3, 4 నెలకోసారి స్టైఫండ్ : ఏలూరు సర్వజన ఆసుపత్రి భవనంలో జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ కోర్సులు ఉచితంగా అందిస్తున్నారు. జీఎన్ఎం కోర్సులో సుమారుగా 150 మంది విద్యార్థినులు ఉండగా, బీఎస్సీ నర్సింగ్ కోర్సులో 400 మంది ఉన్నారు. వీరిలో మొదటి సంవత్సరం జీఎన్ఎం కోర్సు చదివే విద్యార్థినికి రూ.3 వేలు, రెండు, మూడో ఏడాదిలో రూ.3500 స్టైఫండ్ ఇస్తున్నారు. బీఎస్సీ నర్సింగ్ విద్యార్థినులకు రూ.4 వేల నుంచి రూ. 4500 వరకు ఇస్తారు. ప్రభుత్వం స్టైఫండ్ నెల నెలా ఇస్తే తప్ప గడవని పరిస్థితి. అలాంటిది మూడు, నాలుగు నెలకోసారి స్టైఫండ్ ఇవ్వడంతో ఖర్చులకు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ప్రతి నెలా స్టైఫండ్ ఇవ్వకపోవడంతో వారి కష్టాలు వర్ణనాతీతం.



ఏలూరు సర్వజన ఆసుపత్రి భవనం (ఫైల్)

వసతి, భోజనం ఖర్చులు భరించాల్సిందే..

రాష్ట్ర వ్యాప్తంగా విశాఖపట్నం, కాకినాడ, ఏలూరు, విజయవాడ, గుంటూరు, కర్నూలు, మచిలీపట్నంలో జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ కాలేజీలు ప్రభుత్వం నిర్వహిస్తోంది. బీఎస్సీ నర్సింగ్‌కు నీట్ ద్వారా ఎంపికలు చేస్తుండగా, జీఎన్ఎం కోర్సుకు డీఎంఈ నోటిఫికేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు. ఈ నర్సింగ్ కాలేజీల నిర్వహణకు, భోజనం, వసతి కోసం నిధులు కేటాయించకపోవటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బీఎస్సీ నర్సింగ్‌లో మెంటల్ హెల్త్ సబ్జెక్టుకు సంబంధించి శిక్షణ కేవలం విశాఖపట్నంలోనే ఉంది. ఈ సబ్జెక్టులో శిక్షణకు విశాఖపట్నం వెళ్లాలి. అక్కడ వసతి, భోజనం ఖర్చులు భరించాల్సి రావటంతో వారిపై పెనుభారం మోపినట్లేనని విద్యార్థినుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లో సర్వేలు, శిక్షణల కోసం అదనపు ఆర్థిక భారం వేస్తున్నాయంటున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం

ఏలూరు సర్వజన ఆసుపత్రిలోని జీఎన్ఎం నర్సింగ్ కాలేజీకి సంబంధించి నిర్వహణ, భోజనం నిమిత్తం ప్రత్యేకంగా నిధులు ఏమీ మంజూరు చేయడం లేదు. విద్యార్థినులకు అందిస్తున్న స్టైఫండ్‌తోనే నిర్వహణ ఖర్చులు, భోజనం ఖర్చులు భరించాలి. ఇప్పటికే చాలా సార్లు నిధులు కేటాయించాలంటూ నివేదికలు పంపించాం.

– వరలక్ష్మి, ప్రిన్సిపల్, జీఎన్ఎం నర్సింగ్ కాలేజీ

ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌లపై సమీక్ష



మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్

భీమవరం (ప్రకాశం చౌక్): ఉజ్వల యోజన ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్ పొంది వినియోగించని లబ్ధిదారుల సమాచారాన్ని సేకరించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో పౌర సరఫరాల అధికారులు, గ్యాస్ కంపెనీల ప్రతినిధులతో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉజ్వల 2.0 పథకం కింద గ్యాస్ కనెక్షన్ పొంది రెండు సంవత్సరాలుగా రీఫిల్ చేసుకోని లబ్ధిదారుల జాబితాను గ్రామాల వారీగా సిద్ధం చేయాలన్నారు. లబ్ధిదారులకు మొదటి నోటీసు జారీ చేసిన 15 రోజులలోపు వారికి సంబంధించిన గ్యాస్ పంపిణీదారుల కంపెనీకి వెళ్ళి, వారి ఈకేవైసీ ఫార్మాలిటీలు, బయోమెట్రిక్ మళ్ళీ పూర్తి చేసుకోవాలని చెప్పాలన్నారు. ఈకేవైసీ పూర్తి చేసుకోవడానికి చివరి అవకాశాన్ని ఇచ్చేందుకు తుది నోటీసు జారీచేయాలన్నారు. సమావేశంలో పౌర సరఫరాల అధికారి ఎన్. సరోజ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

గణాంకాలు సకాలంలో నమోదు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్ఓ జి.గీతాబాయి

భీమవరం(ప్రకాశంచౌక్): జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖ అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాల వివరాలను సకాలంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీఎంఅండ్‌హెచ్ఓ జి.గీతాబాయి అన్నారు. భీమవరం మున్సిపల్ కార్యాలయంలో ప్రోగ్రాం ఆఫీసర్ల శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మాతా శిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, కుటుంబ నియంత్రణ ఇతర జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నూరు శాతం గణాంకాల నమోదుకు, లక్ష్య సాధనకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు భానునాయక్, డి.సుధాలక్ష్మి, వి.ప్రసాదరావు, జి.ధనలక్ష్మి పాల్గొన్నారు.

పీజీ సెంటర్‌లో ఎంసీఏ కోర్సు

నూజివీడు: పట్టణంలోని పీజీ కేంద్రంలో రాబోయే విద్యాసంవత్సరం నుంచి ఎంసీఏ కోర్సు ఏర్పాటు చేస్తున్నామని కృష్ణా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య కూన రాంజీ పేర్కొన్నారు. కృష్ణా యూనివర్శిటీకి చెందిన పట్టణంలోని ఎమ్మార్ అప్పారావు పీజీ కేంద్రం ప్రధాన గేటు నిర్మాణానికి వైస్ చాన్సలర్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన అకడమిక్ భవనాన్ని జులైలోగా పారంభిస్తామన్నారు. పీజీ కేంద్రానికి సోలార్ విద్యుత్ సదుపాయాన్ని త్వరలోనే ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పీజీ కేంద్రం ప్రధాన భవనానికి హంగులు దిద్దేందుకు తగిన సూచనలు ఇవ్వాలని ఆర్అండ్‌బీ అధికారులను కోరామన్నారు. రాబోయే రోజుల్లో ఫార్మసీ కళాశాలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. పీజీ సెంటర్‌లో ల్యాబ్‌లు అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పీజీ కేంద్రం ప్రిన్సిపాల్ జే నవీన లావణ్యలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేయాలి



గూడెంలో స్పెషల్ క్లాసులు పరిశీలిస్తున్న డీఈఓ నారాయణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈఓ) నారాయణ పేర్కొన్నారు. మేలో జరిగే సప్లిమెంటరీ పరీక్షల కోసం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో స్పెషల్ క్లాసుల నిర్వహణను శనివారం డీఈఓ పరిశీలించారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాలపై సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాల కోసం ఆహ్వానం, ప్రభుత్వ పథకాలు, పాఠశాలలో సౌకర్యాలు తదితర విషయాలపై చర్చించారు. విద్యా శాఖ కరపత్రాలను డీఈఓ ఆవిష్కరించారు. డీవైఈఓ ఎస్.శ్రీనివాసరావు, ఎంఈఓ హనుమ, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా పోలీసు తనిఖీలు



భీమవరం కొత్త బస్టాండ్ కాంప్లెక్స్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

భీమవరం: కశ్మీర్‌లో ఇటీవల ఉగ్రదాడి దృష్ట్యా.. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాల మేరకు శనివారం జిల్లా వ్యాప్తంగా పోలీసుల ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. బాంబు గుర్తింపు బృందం, డాగ్ స్క్వాడ్ సిబ్బంది నేతృత్వంలో జిల్లాలోని అన్ని బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు రద్దీగా ఉండే బహిరంగ ప్రదేశాలలో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. హోటళ్లు, లాడ్జీలలో బస చేస్తున్న వ్యక్తుల వివరాలు తనిఖీ చేశారు. విస్తృత తనిఖీలకు జిల్లా ప్రజలు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు గమనిస్తే తక్షణమే పోలీసు అధికారులకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా జిల్లా పోలీసు ఉన్నతాధికారులు విజ్ఞప్తి చేశారు.

ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపాలి



ఆకివీడు వైఎస్సార్ సెంటర్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

ఆకివీడు: ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపాలని వారి అంతానికి దేశ ప్రజలంతా అండగా ఉంటారని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ముక్తకంఠంతో నినదించాయి. ఉగ్రదాడులకు నిరసనగా స్థానిక వైఎస్సార్ సెంటర్‌లో శనివారం కొవ్వొతుల ప్రదర్శన, శాంతి ర్యాలీ నిర్వహించారు. పట్టణ, మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, మండల, పట్టణ కమిటీ అధ్యక్షులు నంద్యాల సీతారామయ్య, అంబటి రమేష్, ఏఎంసీ మాజీ చైర్మన్లు మోటుపల్లి గంగాధరరావు, ఎండీ.మస్తాన్ వలీ మాట్లాడుతూ ఉగ్రవాదులకు మద్దతిస్తున్న వారిని కూడా మట్టుబెట్టాలన్నారు. అమరులైన వ్యక్తుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించి, ప్రభుత్వం అండగా ఉండాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గట్టి భద్రత ఏర్పాట్లు చేయాలని కోరారు. ఎండీ.జహంగీర్, ఎస్కే. ఆరీఫ్, ఎండీ.జక్కీ, ఎండీ.సిద్ధిక్, ఎస్కే.హుస్సేన్, గుండా సుందరరామనాయుడు, జీ.ధనరాజు, మోరా జ్యోతిరెడ్డి, పడాల శ్రీనివాస రెడ్డి, నిమ్మల నాగు పాల్గొన్నారు.

28న ఏలూరులో ప్రత్యేక ఉద్యోగ మేళా

ఏలూరు (టూటౌన్): జిల్లా ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ కెరీర్ సర్వీస్(ఎన్‌సీఎస్) భాగస్వామ్యంతో ఈ నెల 28న ఉదయం 10:30 గంటలకు ఏలూరులో ప్రత్యేక ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సి.మధుభూషణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయసు గల పురుష అభ్యర్థులు.. ఆటోమొబైల్ రంగంలో అనుభవం ఉన్నవారు లేదా ఫ్రెషర్స్ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సేల్స్ విభాగానికి డిగ్రీ ఉండాలని, వర్క్‌షాపు పోస్టులకు డిప్లమో లేదా బీ.టెక్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. మరింత సమాచారం కోసం 8886882032 నెంబరులో సంప్రదించాలన్నారు.

దళారుల నిలువు దోపిడీ

- మొక్కజొన్నకు మద్దతు ధర తగ్గింపు
- రైతుల గగ్గోలు
- పట్టించుకోని ప్రభుత్వం
- జిల్లా వ్యాప్తంగా 48,878 ఎకరాల్లో సాగు

ఏలూరు (మెట్రో): జిల్లా వ్యాప్తంగా మొక్కజొన్న రైతులను దళారులు నిలువునా దోచుకుంటున్నారు. ప్రభుత్వం ఆదుకోకపోవడంతో.. మద్దతు ధర లభించకపోవడంతో రైతులు అయినకాడికి అమ్ముకుంటున్నారు. ప్రకృతి కరుణించడంతో దిగుబడులు బాగానే వచ్చినా.. కూటమి సర్కారు రైతులపై కక్ష కట్టింది. జిల్లాలో ఎక్కువగా మెట్టప్రాంతం ఉండటంతో ప్రస్తుత సీజన్‌లో రెండో పంటగా రైతులు 48,878 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ప్రస్తుతం దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఆనందపడ్డారు. ప్రకృతి కనికరించడంతో ఎకరానికి 35 నుండి 40 క్వింటాళ్ల వరకూ దిగుబడి వచ్చింది.అయితే మద్దతు ధర లేకపోవడం, దళారులు దోపిడీతో ఆ ఆనందం కాస్తా ఆవిరైంది.

క్వింటాల్‌కు రూ.400 తగ్గింపు

గత వైఎస్సార్‌సీపీ సర్కారు క్వింటాల్‌కు రు.2600 కనీస మద్దతు ధర ప్రకటించింది. గతేడాది కంటే ఈ ఏడాది కనీస మద్దతు ధర పెరుగుతుందని రైతులు భావించారు. ప్రస్తుతం రూ.2,225కు ధర తగ్గించడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. క్వింటాల్‌కు సుమారు రూ.400 తగ్గించడం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఎకరం సాగు చేసేందుకు రూ.40 వేల నుంచి రూ.45 వేల వరకూ ఖర్చవుతుంది. ప్రభుత్వం ప్రకటించిన ధర ప్రకారం ఖర్చులు, పెట్టుబడి పోను ఎకరానికి రూ.20 వేల వరకే మిగులుతుందని రైతులు చెబుతున్నారు. గత ఏడాది ఇచ్చిన మద్దతు ధర ఇచ్చినా లాభాలు వచ్చేవని రైతులు అంటున్నారు. గతంలో రైతు భరోసాతో ప్రభుత్వం ఆదుకునేది. రైతులకు కనీస మద్దతు ధర అందించి రైతులు పండించిన పంటను నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేసేది. నేరుగా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా సాయాన్ని అందిస్తూ రైతులను గత ప్రభుత్వం ఆదుకునేది. ప్రస్తుతం మద్దతు ధర లేదు, రైతులకు సాయం లేదు.

బర్డ్‌ఫ్లూ దెబ్బకు తగ్గిన డిమాండ్

జిల్లాలో మొక్కజొన్నను 80 శాతం పైగా కోళ్ల ఫారాలకు సరఫరా చేసి మేతగా వినియోగించేవారు. ఇటీవల కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాపించడంతో పౌల్ట్రీ రంగం కుదేలైంది. దీంతో కోళ్ల ఫాంలు మూతపడ్డాయి. దీంతో మొక్కజొన్నకు డిమాండ్ తగ్గడంతో రైతుల పండించిన పంటను దళారులు తమ ఇష్టం వచ్చిన ధరకు కొనుగోలు చేస్తూ దోచుకుంటున్నారు. ఒక వైపు రైతులను ప్రభుత్వం ఆదుకోకపోగా మరో వైపు మద్దతు ధర తగ్గించడం వంటి పరిణామాలతో మొక్కజొన్న రైతు లబోదిబోమంటున్నాడు.



జిల్లాలో మొక్కజొన్న సాగు వివరాలు
జిల్లాలో మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు: 18,345 మంది
జిల్లాలో సాగు: 48,878 ఎకరాలు
ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర: రూ.2,225
దళారులు కొనుగోలు చేస్తున్న ధర: రూ.2 వేల నుంచి 2,200

మెగా డీఎస్సీ శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లాకు చెందిన కాపు అభ్యర్థులకు మెగా డీఎస్సీ –2025 కోసం ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ ఎన్. పుష్పలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణా కార్యక్రమానికి సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దేవదాయ శాఖ భూమి స్వాధీనం



భూమిని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

నరసాపురం రూరల్: మండలంలోని చిట్టవరం గ్రామంలో ఆక్రమణలకు గురైన మదన గోపాల స్వామి దేవస్థానం భూమిని శనివారం దేవాదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ నెం 158–18లో భూమి ఆక్రమణకు గురయినట్లు గుర్తించిన అధికారులు దేవదాయ ధర్మాదాయ శాఖ చట్టం ప్రకారం తహసీల్దార్ ఐతం సత్యనారాయణ, నరసాపురం రూరల్ ఎస్సై సురేష్, దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో స్థలాన్ని పరిశీలించారు. ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకుని గోడను నిర్మించి స్థలాన్ని దేవాలయ కార్యనిర్వహణాధికారికి స్వాధీనం చేశారు. దేవాలయ భూములు ఆక్రమించినా, స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

సమాజంలో నాటికలది కీలక పాత్ర



కొంతేరు నాటిక పోటీలలో విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి ఆకుల వెంకట శేషసాయిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాబ్జి



భీమవరంలో చైతన్య భారతి ఆధ్వర్యంలో ప్రదర్శించిన అసత్యం నాటికలోని సన్నివేశం

యలమంచిలి: సమాజంలోని రుగ్మతల్ని వేలెత్తి చూపడంలో నేటికీ నాటికలు కీలకపాత్ర పోషిస్తున్నాయని విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి చెప్పారు. కొంతేరు గ్రామంలోని పులపర్తి వీరాస్వామి యూత్ క్లబ్ కళామందిరంలో 43వ జాతీయ స్థాయి నాటిక పోటీల ప్రారంభ సభలో ఆయన మాట్లాడారు. సినిమాలు, టీవీ, ఓటీటీ వంటి మీడియా ప్రభంజనం సృష్టిస్తున్న నేటి రోజుల్లో కూడా నాటికలకు ఆదరణ లభించడం మంచి పరిణామం అన్నారు. కళలకు కాణాచి వంటి గోదావరి జిల్లాలో జన్మించడం తన అదృష్టమన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ త్సవటపల్లి సత్యనారాయణమూర్తి (బాబ్జి) మాట్లాడుతూ కొంతేరు ప్రజలు నాలుగు దశాబ్దాలుగా ఈ నాటిక పోటీలు విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి ఆకుల వెంకట శేషసాయిని డాక్టర్ బాబ్జీ, కమిటి సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో నరసాపురం ఆర్డీఓ దాసి రాజు, కొంతేరు యూత్ క్లబ్ అధ్యక్షుడు అంబటి మురళీకృష్ణ, కొంతేటి సర్వేశలింగం, గుండా రామకృష్ణ, ఉన్నమట్ల కబర్ధి, బుద్దాల రామారావు, పులపర్తి రాజగోపాలరావు, వంగా నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు అలరించిన నాటికలు

టెక్నాలజీ అవసరానికి వాడితే మిత్రుడు, అవసరానికి మించి వాడితే శత్రువు అని 'నా శత్రువు' నాటిక.. సమాజం బాగు కోసం కళాకారుల్లో ఉండే తపన రాజకీయ నాయకుల్లో ఉంటే దేశం ఏ విధంగా అభివృద్ధి చెందుతుందో 'ఆంగికం భువనం యస్య' నాటికలోను.. జనరల్ బోగీలో ప్రయాణికుల కష్టాలు ఏ విధంగా ఉంటాయో 'జనరల్ బోగీలు' నాటికలోను వివరించారు. మూడు నాటికలు అలరించాయి. రెండవ రోజు నాటిక ప్రాంగణానికి బొండాడ వెంకట రాధా రమణ గుప్తా పేరిట నామకరణం చేశారు.

ఆకట్టుకున్న నాటికలు

భీమవరం: పట్టణంలోని గన్నాబత్తుల క్రీడామైదానంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి సాంఘిక నాటిక పోటీల్లో శనివారం మూడు నాటికలు రసవత్తరంగా సాగాయి. హైదరాబాద్ శ్రీమహతి క్రియేషన్స్ వారి సింహ ప్రసాద్ రచించగా.. ఉప్పలూరి సుబ్బరాయశర్మ దర్శకత్వంలో ప్రదర్శించిన 'ఉక్కు సంకెళ్లు' నాటిక ఈస్టిండియా కంపెనీ దురాగతాలను ఎత్తి చూపింది. ఫిలిప్స్ దొర అడిగిన వెంటనే హిల్సా చేప ఇవ్వలేదనే కోపంతో హుగ్లీ నదిలో చేపల వేట నిషేధిస్తే దానికి ఆనాటి జమిందారిణి రాణీ రాస్మణీదేవి ఏ విధంగా అడ్డుకున్నది కళ్లకు కట్టినట్లు చూపించారు. రెండో ప్రదర్శనగా విశాఖ ఉక్కు నగరం శ్రీచైతన్య కళాస్రవంతి వారి '(అ)సత్యం' నాటిక పి.బాలాజీ నాయక్ దర్శకత్వంలో ప్రదర్శించారు. కంటికి కనిపించేదంతా సత్యం కాదు, కనిపించనిదంతా అసత్యం కాదనే సందేశంతో ప్రదర్శించిన నాటిక ప్రేక్షకులను ఆలోచింపచేసింది. మూడో ప్రదర్శనగా హైదరాబాద్ మిత్రా క్రియేషన్స్ 'ఇది రహదారి కాదు' నాటిక ఎస్ఎం బాషా దర్శకత్వంలో ప్రదర్శించారు. సంపాదనే ముద్దు పిల్లలు వద్దు అనే రీతిలో నేటి యువత తీసుకుంటున్న నిర్ణయాలను, దారితప్పిన యువ జంటను చక్కదిద్దిన దృశ్యరూపమే ఈ నాటిక ఇతివృత్తం. కార్యక్రమంలో చైతన్య భారతి అధ్యక్ష, కార్యదర్శులు రాయప్రోలు భగవాన్, మంతెన రామ్‌కుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

భీమవరం: పోక్సో కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. భీమవరం వన్‌టౌన్ సీఐ ఎం నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం భీమవరం పట్టణానికి చెందిన మైనర్ బాలికకు ప్రస్తుతం గునుపూడిలో నివాసముంటున్న భీమవరం మండలం కొత్తపూసలమర్రు గ్రామానికి చెందిన ఎం లక్ష్మీవరప్రసాద్ మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడు. బాలిక గర్భవతి కావడంతో పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు లక్ష్మీవరప్రసాద్‌ను శనివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ నాగరాజు చెప్పారు.

మూడు మట్టి లారీల సీజ్

జంగారెడ్డిగూడెం : కేతవరంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న మూడు లారీలను సీజ్‌చేశారు. కేతవరం చెరువు నుంచి రాత్రి సమయంలో అక్రమంగా మట్టిని తరలిస్తుండగా, వీఆర్‌వో ఫిర్యాదు మేరకు పోలీసులు లారీలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తహసీల్దార్ కె.స్లీవజోజి చర్యలు తీసుకుంటారని స్టేషన్ రైటర్ సత్యనారాయణ తెలిపారు.

కరెంట్ షాక్‌తో పెయింటర్ మృతి

ఏలూరు టౌన్: కరెంట్ షాక్‌తో పెయింటర్ మృతి చెందాడు. దెందులూరు మండలం పోతునూరుకు చెందిన లింగాల పరుశురాం (31) పెయింటర్‌గా పనిచేస్తుంటాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శనివారం ఏలూరు సుబ్రహ్మణ్యం కాలనీలో ఒక భవనానికి మొదటి అంతస్తులో ఐరన్‌పైపునకు రోలర్ బిగించి గోడకు పెయింటింగ్ వేస్తుండగా సమీపంలో 11కేవీ విద్యుత్ వైర్ల ద్వారా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఏలూరు వన్‌టౌన్ ఎస్సై నాగబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి కొండపై షార్ట్‌కట్ మార్గం మూసివేత



వైకుంఠం క్యూకాంప్లెక్స్ సమీపంలోని షార్ట్‌కట్ మార్గంలో ఏర్పాటు చేసిన ఇనుప బారికేడ్

సాక్షి ఎఫెక్ట్

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపైన రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతంలో ఉన్న షార్ట్‌కట్ మార్గాన్ని ఆలయ అధికారులు పూర్తిగా మూసివేశారు. స్వామివారి దర్శనానంతరం పలువురు భక్తులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ సమీపంలోని మార్గం గుండా కొండపైన నిత్యాన్నదాన భవనం, శివాలయం వద్దకు కాలినడకన వెళుతున్నారు. ఆ ప్రాంతంలో జేసీబీతో పూడిక పనులు జరుగుతున్నాయి. దీనిపై సాక్షి దినపత్రికలో ఈనెల 25న 'శ్రీవారి కొండపై షార్ట్‌కట్ మార్గం వద్దు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఆలయ అధికారులు ఆ మార్గాన్ని ఇనుప బారిగేట్‌తో పూర్తిగా మూసివేశారు.

శ్రీవారి చెంత సేద తీరి

- శ్రీవారి ఆలయంలో ఎయిర్ కూలర్ల ఏర్పాటు
- క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లలో ఎండ వేడిమి నుంచి భక్తులకు ఉపశమనం
- దాతల సహకారంతో ఇప్పటికే 25 కూలర్ల ఏర్పాటు
- మరికొన్ని కూలర్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్న అధికారులు



వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో ఎయిర్ కూలర్ నుంచి వచ్చే చల్లదనంతో సేదతీరుతున్న భక్తులు

ద్వారకాతిరుమల: రాష్ట్రంలో ఏ దేవాలయంలోనూ లేని విధంగా ద్వారకాతిరుమల చిన్నవెంకన్న ఆలయంలో ఎయిర్ కూలర్లను ఏర్పాటు చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని దాతల సహకారంతో ఆలయ అధికారులు ఏర్పాటు చేసిన ఈ కూలర్లు భక్తులకు ఎంతో సౌకర్యవంతంగా ఉన్నాయి. వివిధ ప్రాంతాల నుంచి శ్రీవారి దర్శనార్థం క్షేత్రానికి వస్తున్న భక్తులు ఎండ వేడిమి కారణంగా అలసిపోతున్నారు. ఈ క్రమంలో వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూ లైన్లలోకి అడుగుపెట్టగానే ఎయిర్ కూలర్ల నుంచి వస్తున్న చల్లదనాన్ని వారు ఆస్వాదిస్తున్నారు. హమ్మయ్య.. అనుకుంటూ ఉపశమనాన్ని పొందుతున్నారు. క్యూ కాంప్లెక్స్‌లో వేచి ఉండే సమయంలో కొందరు భక్తులు, చిన్నారులు అక్కడే విశ్రాంతి పొందుతున్నారు. పిల్లలను వారి తల్లిదండ్రులు కూలర్ల వద్ద ఆడిస్తున్నారు.

ఒక్కో కంపార్ట్‌మెంట్‌లో నాలుగు కూలర్లు



క్యూలైన్ల వద్ద ఎయిర్ కూలర్‌ను నీటితో తడుపుతున్న సిబ్బంది

వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో మొత్తం ఐదు కంపార్ట్ మెంట్లు ఉన్నాయి. ఒక్కో కంపార్ట్‌మెంట్‌కు నాలుగు కూలర్లు (నాలుగు మూలల) చొప్పున మొత్తం 20 కూలర్లను ఏర్పాటు చేశారు. అలాగే ఆలయంలోని క్యూలైన్ల వద్ద మరో 5 కూలర్లను ఏర్పాటు చేశారు. సిబ్బంది నిరంతరాయంగా ఆ కూలర్లను నీటితో తడుపుతున్నారు. భక్తుల పట్ల వారు చూపుతున్న శ్రద్ధను పలువురు కొనియాడుతున్నారు. ఇదిలా ఉంటే ఒక్కో కూలర్ ధర రూ. 18 వేలు అని, దాతల సహకారంతో మరికొన్ని కూలర్లను ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు.

మరిన్ని సౌకర్యాలు

క్యూ కాంప్లెక్స్‌లో దేవస్థానం సిబ్బంది భక్తులకు మజ్జిగను, మంచి నీటిని అందిస్తున్నారు. అలాగే అందులో ఉన్న స్క్రీన్‌పై క్షేత్ర చరిత్ర, అన్నమయ్య, దేవతామూర్తుల చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. దాంతో చల్లని వాతావరణంలో వాటిని తిలకిస్తూ, దర్శనం కోసం వేచి ఉండే సమయాన్ని భక్తులు మరచిపోతున్నారు. క్షేత్రంలో సౌకర్యాల కల్పనకు అధికారులు చేపడుతున్న చర్యలపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అలసట మాయం



ఆలయానికి వచ్చేటప్పుడు ఎండ వేడిమికి భయపడ్డాను. బయట వాతావరణం చూసి దర్శనం క్యూలైన్లలో ఉండగలమా అనిపించింది. కానీ వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోనూ, క్యూలైన్ల వద్ద ఎయిర్ కూలర్ల నుంచి వస్తున్న చల్లదనం అలసటను మాయం చేసింది. క్యూ కాంప్లెక్స్‌లో ఇంకా సేపు ఉంటే బాగుండేదని అనిపించింది.

– కామిశెట్టి దుర్గా లక్ష్మి, భక్తురాలు, పోలవరం మండలం, రేపల్లెవాడ గ్రామం

ఏ ఆలయంలోనూ ఇలా లేదు



క్యూ కాంప్లెక్స్‌లో సౌకర్యాలు బాగున్నాయి. ఏ ఆలయంలోనూ లేని విధంగా ఇక్కడ ఎయిర్ కూలర్లు ఏర్పాటు చేశారు. అలాగే క్యూ కాంప్లెక్స్‌లోని స్క్రీన్‌పై క్షేత్ర చరిత్ర, వేంకటేశ్వర స్వామికి సంబంధించిన చిత్రాలను ప్రదర్శించడం బాగుంది. భక్తులందరికీ మజ్జిగను కూడా అందిస్తున్నారు. వేసవిని పురస్కరించుకుని ఆలయ అధికారులు చేపట్టిన చర్యలు అద్భుతంగా ఉన్నాయి.

– పరసా రాఘవేంద్ర, మచిలీపట్నం, భక్తుడు

వేల్పూరులో చోరీ



వివరాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

తణుకు అర్బన్ : తాళం వేసి ఉన్న ఇంట్లోకి ప్రవేశించి బంగారు ఆభరణాలు దోచుకున్న ఘటన తణుకు మండలం వేల్పూరులో చోటుచేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తణుకు మండలం వేల్పూరు బాలాజీ నగర్ 11వ రోడ్డులో నివసిస్తున్న చొప్ప కృష్ణకాంత్ వారం రోజులక్రితం ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా హైదరాబాద్‌కు వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించిన దుండగులు శుక్రవారం అర్ధరాత్రి ఇంటి తలుపులు పగలగొట్టి బీరువాలోని 12 కాసుల బంగారు ఆభరణాలతో పాటు రూ. 50 వేలు నగదును అపహరించుకుపోయారు. శనివారం ఇంటికి చేరుకున్న కృష్ణకాంత్ ఇంటి తలుపు పగలగొట్టి ఉండడంతోపాటు బీరువాలోని వస్తువులు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. రూరల్ పోలీసులు, క్లూస్ టీం ఘటనా ప్రాంతానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. చోరీ జరిగిన ఇంట్లో, ఆరుబయట సీసీ కెమెరాలు ఉనప్పటికీ దుండగులు వాటిని ధ్వంసం చేసినట్లు బాధితులు చెబుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు తణుకు రూరల్ ఎస్సై కె.చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి మాఫియా ఆగడాలపై నిరసన



ఆచంటలో నక్కల డ్రయిన్ తవ్వకాలపై నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

పెనుగొండ : మట్టి మాఫియా ఆగడాలపై శనివారం సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ఆచంట నియోజకవర్గంలో ఆచంట వేమవరం, ఆంచట శివారు నక్కల కాలువ, గుమ్ములూరు రాయగొప్ప నక్కల కాలువలో మట్టి తవ్వకాలు జరిపిన ప్రాంతాలను సీపీఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ మాట్లాడుతూ మట్టి మాఫియా ఆగడాలు రోజురోజుకు పెచ్చు పెరిగిపోతున్నాయన్నారు. మట్టి తరలింపు ఇంత పెద్ద ఎత్తున జరుగుతున్నా.. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు రాజకీయ ఒత్తిడులకు తలొగ్గి మౌనం వహిస్తున్నారని మండిపడ్డారు. ఆక్రమణలు వెనుక మామూళ్ల కథ ఉందన్నారు. ప్రభుత్వ స్థలాలు, బోదే గట్టు, కాలువ గట్టు మట్టి తీసుకుపోతున్నా అధికారులు కన్నెత్తి చూడలేదన్నారు. జిల్లా మంత్రి అండదండలతోనే మట్టి తవ్వకాలు జరిగాయని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా 15 అడుగుల లోతు తవ్వేశారన్నారు. పశువులు దిగితే జాడ కనిపించే పరిస్థితి లేకుండా ఉందన్నారు. పూర్తిగా తవ్వేయడం వలన గట్టుకు ప్రాంతంలో ఉన్న అయిదు గ్రామాలకు ప్రమాదం పొంచి ఉందని, వెంటనే చర్యలు తీసుకోకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు పిల్లి ప్రసాద్, మూడే మోజేస్, పి మోహనరావు, ఎస్‌వీఎస్ శర్మ, తలుపూరి బుల్లాబ్బాయి, సిర్రా నరసింహమూర్తి, కొండేటి సత్యనారాయణ, తోటపల్లి సత్యనారాయణ, గెద్దాడ త్రిమూర్తులు పాల్గొన్నారు.

తండ్రికి బైక్‌ను బహుమతిగా ఇవ్వాలని బయలుదేరి..

- రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం
- రోడ్డుపై ఉన్న గేదె కళేబరాన్ని ఢీకొన్న బుల్లెట్ బైక్
- ఎగిరి రోడ్డుపై పడిన యువతి..
- వెనుక నుంచి అతివేగంగా వచ్చి ఆమెపై నుంచి వెళ్లిన లారీ



యశస్విని (ఫైల్)

మునగాల: సూర్యాపేట జిల్లా మునగాల మండలం ఆకుపాముల వద్ద విజయవాడ – హైదరాబాద్ జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన యువతి మృతిచెందింది. భీమవరం మండలం తుందుర్రు గ్రామానికి చెందిన చేడె జనార్దన్ కుమార్తె యశస్విని (24) మూడేళ్లుగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. తన తండ్రికి బహుమతిగా ఇవ్వాలనుకుని యశస్విని బుల్లెట్ వాహనాన్ని కొనుగోలు చేసి శుక్రవారం రాత్రి తన సహ ఉద్యోగి బద్దుకొండ అచ్యుత్‌కుమార్‌తో కలిసి అదే బుల్లెట్‌పై తమ స్వగ్రామమైన తుందుర్రుకు బయలుదేరింది. బుల్లెట్ బైక్‌ను అచ్యుత్‌కుమార్ నడుపుతున్నాడు. ఈ క్రమంలో ఆకుపాముల శివారులోకి రాగానే హైవేపై పడి ఉన్న గేదె కళేబరాన్ని ఢీకొట్టారు. దీంతో యశస్విని బుల్లెట్‌పై నుంచి ఎగిరి రోడ్డుపై పడింది. అదే సమయంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే లారీ అతివేగంతో వచ్చి రహదారిపై పడిఉన్న యశస్విని మీదుగా వెళ్లింది. దీంతో యశస్విని తల, మెడభాగం ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందింది. అచ్యుత్‌కుమార్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న మునగాల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని యశస్విని మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శనివారం మృతురాలి కుటుంబ సభ్యులు మునగాలకు చేరుకున్నారు. మృతురాలి బాబాయ్ చేడె సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. యశస్విని మృతదేహాన్ని ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వైఎస్సార్ సీపీలో నియామకాలు



కరిమెరక రామచంద్రరావు



ఈదా యోహోషువ (జాషువా)

ఆకివీడు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీ నియామకాల్లో భాగంగా ఉండి నియోజకవర్గానికి చెందిన ఇద్దరిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు విడుదల చేసింది. పార్టీలో పంచాయతీరాజ్ విభాగం జిల్లా కార్యదర్శిగా, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా పనిచేస్తున్న కరిమెరక రామచంద్రరావును పార్టీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కార్యదర్శిగా నియమించారు. అలాగే ఆకివీడుకు చెందిన ఈదా యోహోషువ(జాషువా)కు రాష్ట్ర అనుబంధ కమిటీలో ఇంటెలెక్చువల్స్ ఫోరం అధికార ప్రతినిధిగా నియమింపబడ్డారు. గతంలో జాషువా ఐటీ విభాగంలో జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. రాష్ట్ర స్థాయి పదవులు లభించడం పట్ల రామచంద్రరావు, జాషువాకు పలువురు అభినందనలు తెలియజేశారు.

శ్రీవారి క్షేత్రం.. భక్తజన సంద్రం



అనివేటి మండపంలో కోలాట భజనలు

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రం శనివారం భక్తజన సంద్రమైంది. స్వామివారికి ప్రీతికరమైన రోజు, అందులోనూ వేసవి సెలవులు కావడంతో మండుటెండను సైతం లెక్కచేయకుండా సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దాంతో ఎటు చూసినా భక్తజనమే కనిపించారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. తూర్పురాజగోపుర ప్రాంతంలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్, స్వామివారి ఉచిత ప్రసాదం పంపిణీ ప్రాంతం, దర్శనం క్యూలైన్లు భక్తులతో పోటెత్తాయి. అలాగే ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల, నిత్యాన్నదాన భవనం తదితర విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి. రాత్రి వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది. ఆలయ అనివేటి మండపంలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి.

ఉప్పుటేరు ఆక్రమణల తొలగింపునకు సహకరించండి



కొట్టాడ గ్రామం ఉప్పుటేరు వద్ద డ్రోన్ సాయంతో ఆక్రమణలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు

కైకలూరు : వరదల సమయంలో కొల్లేరుకు చేరే నీటిని సముద్రానికి పంపించడానికి ప్రధాన భూమిక వహించే ఉప్పుటేరు ఆక్రమణల తొలగింపునకు అందరూ సహకరించాలని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఉండి ఎమ్మెల్యే, ఉప సభాపతి కనుమూరి మురళీకృష్ణంరాజు అన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు కొల్లేరు అంశంపై కమిటీ నివేదిక కోరిన నేపథ్యంలో వారు కొట్టాడ గ్రామం వద్ద ఉప్పుటేరు ఆక్రమణలను డ్రోన్ సాయంతో శనివారం పరిశీలించారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఉప్పుటేరులో ఆక్రమణల కారణంగా 10 వేల క్యూసెక్కుల నీటిని తరలించే ఉప్పుటేరు 6 వేల క్యూసెక్కులకు పడిపోయిందన్నారు. ఇలానే కొనసాగితే కొల్లేరు ముంపు మరొకసారి తప్పదన్నారు. వర్షాకాలం వచ్చే నాటికీ ఆక్రమణలు తొలగించాలని నిర్ణయించారు. ఇందుకు ఆక్రమణదారులు డ్రెయినేజీ, రెవెన్యూ, పోలీస్ శాఖలకు సహకరించాలన్నారు. లేనిపక్షంలో చట్టం తన పని చేసుకుంటుందని ఆక్రమణదారులను పరోక్షంగా హెచ్చరించారు. త్వరలో సుప్రీంకోర్టు సాధికారత కమిటీ పర్యటనకు వస్తోందని కొల్లేరు ప్రజలు సమస్యలను విన్నవించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, వడ్డీ సాధికారిత రాష్ట్ర కన్వీనర్ బలే ఏసురాజు, కూటమి నేతలు పెన్మత్స త్రినాథ రాజు, పూలా రాజీ, కొల్లి బాబీ, సర్పంచులు, కొల్లేరు పెద్దలు పాల్గొన్నారు.

నిందితులకు రిమాండ్

యలమంచిలి: హత్య కేసులో నిందితులకు కోర్టు రిమాండ్ విధించినట్లు పాలకొల్లు రూరల్ సీఐ గుత్తుల శ్రీనివాస్ తెలిపారు. కొంతేరు కట్టావారి పుంతలో కత్తుల పోలును హత్య చేసిన కేసులో నిందితులైన భార్యభర్తలు బత్తుల ప్రభుదాసు, భారతిలను శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకుని నరసాపురం కోర్టుకు తరలించగా న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించినట్లు సీఐ చెప్పారు. దీంతో ఏసుదాసును నరసాపురం సబ్ జైలుకు, భారతిని తణుకు మహిళా జైలుకు పంపినట్లు చెప్పారు.

28న తీపర్రులో జిల్లా బీచ్ కబడ్డీ జట్ల ఎంపిక

తణుకు అర్బన్: రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల బీచ్ కబడ్డీ పోటీలకు జిల్లా స్త్రీ, పురుషుల జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 28న నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు అప్పలరాజు, అసోసియేషన్ సెక్రటరీ వై.శ్రీకాంత్ తెలిపారు. పెరవలి మండలం తీపర్రులో మధ్యాహ్నం 2 గంటలకు కబడ్డీ పోటీలు ప్రారంభిస్తామన్నారు. ఎంపికైన క్రీడాకారులు మే 2 నుంచి 4వ తేదీ వరకు కాకినాడలో జరగనున్న అంతర్ జిల్లాల స్త్రీ, పురుషుల బీచ్ కబడ్డీ పోటీలో పాల్గొంటారని చెప్పారు. వివరాలకు 94913 33906, 96424 96117 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జాతీయ స్థాయి పోటీలకు హేమ వర్షిణి



తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం సుబ్బారావుపేట భవిత కేంద్రానికి చెందిన ఒమ్మి హేమ వర్షిణి జాతీయ స్థాయి స్పెషల్ ఒలంపిక్స్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల కృష్ణా జిల్లా ఆగిరిపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి బోసీ బాల్ విభాగంలో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికై నట్లు భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయుడు కే.బాల ఈశ్వరయ్య వివరించారు. ఈ పోటీలు చత్తీస్‌ఘడ్‌లో జరగనున్నట్లు వెల్లడించారు. బాలిక హేమవర్షిణి ఇటీవల పదవ తరగతి ఉత్తీర్ణురాలైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఉపాధ్యాయుడు బాల ఈశ్వరయ్య, ఉపాధ్యాయులు విద్యార్థిని హేమ వర్షిణిని అభినందించారు.

బీచ్‌లో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



లాలూ నాయక్ మృతదేహం

ద్వారకాతిరుమల: మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌లో శుక్రవారం గల్లంతైన ద్వారకాతిరుమలకు చెందిన యువకుడు లాలూ నాయక్ (17) మృతదేహం శనివారం లభ్యమైంది. మండలంలోని కొమ్మర, కోడిగూడెం, ద్వారకాతిరుమల, సత్తెన్నగూడెం గ్రామాలకు చెందిన 10 మంది స్నేహితులతో కలసి లాలూ నాయక్ పేరుపాలెం బీచ్‌కు వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో స్నానం చేస్తుండగా గల్లంతయ్యాడు. అర్ధరాత్రి సమయం నుంచి అతడి ఆచూకీ కోసం స్నేహితులు వెదకడం మొదలు పెట్టారు. అయితే నీటి మునిగిన ప్రాంతానికి 5 కిలో మీటర్ల దూరంలో, బీచ్ ఒడ్డున లాలూ నాయక్ మృత దేహం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో అతడి అన్నయ్య చిన్నాకు కనిపించింది. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించి, కుటుంబ సభ్యులకు అప్పగించగా, వారు కొవ్వూరు ఘాట్‌లో ఖననం చేశారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



దిబ్బగూడెంలోని మీనాక్షి మృతదేహం

పెదవేగి : అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన దిబ్బగూడెంలో చోటుచేసుకుంది. పెదవేగి ఎస్సై కె రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు ఎన్టీఆర్ కాలనీకి చెందిన తేటకాల పావని మొదటి కుమార్తె మీనాక్షికి పెదవేగి మండలం దిబ్బగూడెం గ్రామానికి చెందిన బాల సురేష్‌తో ఐదేళ్ల కిత్రం వివాహమైంది. వీరికి 19 నెలల ఆడబిడ్డ సంతానం ఉంది. వివాహ సమయంలో రూ.3 లక్షలు కట్నం ఇవ్వగా మిగిలిన రూ.2 లక్షలు గురించి భర్త, అత్త మామలు వేధిస్తున్నారని ఈనెల 25వ తేదీ రాత్రి మీనాక్షి తల్లి పావనికి ఫోన్ చేసి చెప్పింది. శనివారం మీనాక్షి చనిపోయిందని చెప్పారని, కానీ ఆమె ఒంటిమీద దెబ్బలు ఉన్నాయని మృతురాలు తల్లి పావని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె రామకృష్ణ తెలిపారు. మీనాక్షి మృతదేహాన్ని శవపంచనామ నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ వెంకటేశ్వరరావు చెప్పారు.

రాత్రివేళల్లో జోరుగా మట్టి తవ్వకాలు



దొరమామిడి సమీపంలో రాత్రివేళల్లో జేసీబీతో మట్టి తవ్వుతున్న దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని దొరమామిడి పరిసర ప్రాంతాల్లో రాత్రివేళల్లో అక్రమ మట్టి తవ్వకాలు,, రవాణా యథేచ్ఛగా సాగుతున్నాయి. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో కొందరు కూటమి నాయకులు జేసీబీలు పెట్టి ట్రాక్టర్‌లతో అక్రమంగా మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సామాన్యుడు ఒక ట్రక్కు మట్టి కావాలంటే కనీసం అనుమతి కోసం సరైన సమాధానం చెప్పని అధికారులు, యథేచ్ఛగా మట్టి రవాణా జరుగుతున్నా పట్టించుకోకపోవడం పట్ల పలువురు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ మట్టి రవాణాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.6 లక్షల విరాళం



దాత వెంకట్రావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు వేర్వేరుగా శనివారం రూ.6 లక్షలను విరాళంగా అందజేశారు. అందులో భాగంగా తణుకు మండలం కానూరుకు చెందిన వీరమల్లు వెంకట్రావు రూ.5 లక్షలు, కాజా పడమరకు చెందిన గుబ్బల రామారావు రూ.లక్ష ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాలను అందించారు. అనంతరం వారికి స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

యలమంచిలి: విద్యుత్ షాక్‌తో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాల ప్రకారం పోడూరు మండలం వద్దిపర్రు పంచాయతీ చింతలగరువుకు చెందిన గుడాల శ్రీసూర్యతేజ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో విద్యుత్ లైన్ పని ఉందని యలమంచిలికి చెందిన ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ నుంచి కబురు రావడంతో సూర్యతేజ పనికి వచ్చాడు. శిరగాలపల్లి వద్ద శనివారం పని చేయడానికి విద్యుత్ స్తంభం ఎక్కగా 11 కేవీ తీగలు తగలడంతో అక్కడికక్కడే మరణించాడు. మృతునికి వివాహం కాలేదు. తల్లీదండ్రులు లక్ష్మీకుమారి, వెంకట సత్యనారాయణ, సోదరుడు ఉన్నారు.

క్లుప్తంగా

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి



తణుకు నరేంద్ర సెంటర్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

తణుకు అర్బన్: జమ్మూ కాశ్మీర్‌లో భారత పర్యాటకులను అత్యంత దారుణంగా చంపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ. ప్రతాప్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక నరేంద్ర సెంటర్‌లో సీఐటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ధర్నా, కొవ్వొత్తులు ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ జమ్మూకాశ్మీర్ ఉగ్రవాదుల దాడులను యావత్ దేశం ఖండిస్తుందని, ఈ దాడులకు కేంద్ర ప్రభుత్వమే ప్రధాన కారణం అని విమర్శించారు. భారత రాజ్యాంగంలో ఉన్న అన్ని హక్కులను మోదీ ప్రభుత్వం ఒక మతంపై దాడి చేయడం వలనే ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 370 ఆర్టికల్ రద్దు, పౌరసత్వం నిరాకరణ, యూసీసీ, వక్ఫ్ బిల్లు, ముస్లిమ్స్‌పై దాడులు వంటి అంశాలను కేంద్ర ప్రభుత్వం ఆలోచించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గార రంగారావు, కామన మునిస్వామి, రమేష్, నూకరాజు, వల్లూరి వెంకటేశ్వరావు, అభిషేక్, నాగరత్నం, కనక రాజు, ఎన్. ఆదినారాయణ బాబు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు



అత్తిలి జడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ గోపీమూర్తి

అత్తిలి: పదో తరగతి పరీక్షా ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి మంచి ఫలితాలు సాధించారని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి అన్నారు. ఇటీవల విడుదలైన టెన్త్ ఫలితాలలో 582 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన అత్తిలి బాలికోన్నత పాఠశాల విద్యార్థిని పి షారోన్ బ్లెస్సీని శనివారం స్థానిక పాఠశాలలో అభినందన సత్కార సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ గోపీమూర్తి మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే జీవిత లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించే వరకు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు సాధించడంలో ఉపాధ్యాయుల కృషి ఎంతగానో ఉందని అన్నారు. ఈసందర్భంగా టెన్త్ టాపర్‌గా నిలిచిన అత్తిలి మండలం కె సముద్రపుగట్టు గ్రామానికి చెందిన షారోన్ బ్లెస్సీని ఎమ్మెల్సీ అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో భీమవరం డివిజన్ డీవైఈవో ఎన్ రమేష్, ఎంఈవో ప్రసాద్, కె సముద్రపుగట్టు మాజీ సర్పంచ్ యాళ్ల అనిత, యాళ్ల స్వామి, హెచ్ఎం జి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తణుకులో పడకేసిన పారిశుద్ధ్యం

- బ్యాంక్ కాలనీలో అధ్వాన్నంగా డ్రెయినేజీ వ్యవస్థ
- దుర్వాసన.. దుర్గంధం మధ్య కాలనీవాసులు..
- ఎక్కడి చెత్త అక్కడే
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు
- ఇదేనా మంచి ప్రభుత్వం...?

తణుకు అర్బన్: పచ్చని మొక్కలతో ఒకప్పుడు జిల్లాలో మోడల్‌గా నిలిచిన తణుకు మునిసిపాలిటీ నేడు పారిశుద్ధ్య నిర్వహణ సమస్యతో కునారిల్లుతోంది. స్వచ్ఛంధ్ర...స్వర్ణాంధ్ర అంటూ రోడ్లు తుడిచేయడం.. సామాజిక మాధ్యమాల్లో తణుకు మెరుస్తుందంటూ సందడి చేసిన కూటమి నేతలకు మునిసిపాలిటీ పరిధిలోని రహదారులపై చెత్తాకుప్పలు, అధ్వాన్నంగా ఉన్న డ్రెయినేజీలు కనిపించడం లేదా అని ప్రజానీకం ప్రశ్నిస్తున్నారు. సమస్య కనిపిస్తున్నా మేమింతే అన్నట్లుగా ఇటు పాలకులు, అధికారులు పారిశుద్ధ్య నిర్వహణ అమలు చేస్తుండడంతో ప్రజలకు సైతం చిర్రెత్తుకొస్తుంది. గత ఐదేళ్లపాటు పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకపోగా ఇప్పుడు రోడ్లపై చెత్త ఎందుకు పేరుకుపోతుందంటూ ప్రజలు కార్మికులను నిలదీస్తున్నారు.

డ్రెయినేజీలను పట్టించుకునే నాధులేరి..

తణుకు బ్యాంక్ కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థను చూస్తుంటే పారిశుద్ధ్య నిర్వహణ జరుగుతుందా అనే అనుమానం కలుగుతున్న పరిస్థితులు అక్కడ కనిపిస్తున్నాయి. డ్రెయినేజీలను పారిశుద్ధ్య కార్మికులు కానీ, అధికారులు కానీ కంటిచూపునకు కూడా నోచుకోవడంలేదని తెలుస్తోంది. డ్రెయినేజీల్లో చెత్త చెదారం మాట అలా ఉంచితే అధికశాతం డ్రెయినేజీలు పిచ్చిమొక్కలతో నిండిపోయి డ్రెయినేజీ ఎక్కడ ఉందో కూడా తెలియని స్థితిలో ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. డ్రెయినేజీ కనిపిస్తున్న ప్రాంతాల్లో కంటితుడుపుగా పారిశుద్ధ్య నిర్వహణ చేస్తున్నారని వాపోతున్నారు. దీంతో డ్రెయినేజీల్లో మురుగునీరు నిల్వలు ఉండిపోయి దోమలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో కూడా దోమలు వదలడంలేదంటే పారిశుద్ధ్య నిర్వహణ ఏరకంగా ఉందో తెలుస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నంబరు 13 మునిసిపల్ పాఠశాల ప్రాంతంలోని ఖాళీస్థలంలో మురుగునీరు నిల్వ ఉండి డ్రెయినేజీతో సమానంగా కలిసిపోయి తీవ్ర దుర్గంధ వాతావరణాన్ని సృష్టిస్తుందని పలువురు చెబుతున్నారు. పట్టణం పందులమయమైపోయినా ఇటు పాలకులు, అధికారులు పట్టించుకోకుండా పారిశుద్ధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలని పిలుపునివ్వడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.



తణుకు నంబరు 13 మునిసిపల్ పాఠశాల వద్ద మురికినీటితో దుర్గంధంగా ప్రైవేటు ఖాళీస్థలం, డ్రెయినేజీ



తణుకు బ్యాంక్ కాలనీలో పిచ్చిమొక్కలు, చెత్తా చెదారాలతో మూసుకుపోయిన డ్రెయినేజీ



తణుకు బ్యాంక్ కాలనీ పార్కు ప్రాంతంలో పిచ్చిమొక్కలు పెరిగిపోయి అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ

పట్టని అధికార యంత్రాంగం



తణుకు శీనివారి వీధిలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన డ్రెయినేజీ

పారిశుద్ధ్య నిర్వహణ అధ్వాన్నంగా ఉందంటూ ప్రజానీకం పారిశుద్ధ్య విభాగ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. డ్రెయినేజీల్లో నీరు వెళ్లడంలేదని చెబుతుంటే రేపు మాపంటూ రోజులు గడిపేస్తున్నారని ఆరోపిస్తున్నారు. తణుకు మెరుస్తోందో లేక కంపు కొడుతుందో పాలకులు, అధికారులు తేల్చాలంటూ ప్రజానీకం దుమ్మెత్తిపోస్తున్నారు. గతంలో ఇంటి చెత్త నేరుగా కంపోస్టుకు తరలించగా నేడు ప్రత్యేకంగా డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసి కూటమి ప్రభుత్వం తిరిగి పూర్వపు రోజులను తీసుకువచ్చిందంటూ ఎద్దేవా చేస్తున్నారు.

చలో గుంటూరుకు తరలిరావాలి

తాడేపల్లిగూడెం రూరల్: కోకో రైతుల సమస్యలపై ఈ నెల 28వ తేదిన నిర్వహించ తలపెట్టిన చలో గుంటూరు కార్యక్రమానికి రైతులు తరలిరావాలని ఏపీ కోకో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోళ్ళ వెంకటసుబ్బారావు (సబ్బి) పిలుపునిచ్చారు. శనివారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 28వ తేదిన ఉదయం 10 గంటలకల్లా గుంటూరు చుట్టగుంటలోని రాష్ట్ర ఉద్యాన శాఖ కమిషనర్ కార్యాలయానికి చేరుకోవాలన్నారు.

29న తణుకులో మెగా జాబ్ మేళా

తణుకు అర్బన్: యువతీ యువకులకు ఉద్యోగావకాశాల కల్పనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (స్కిల్ డెవలప్‌మెంట్), నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్‌సీఎస్)ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్ తెలిపారు. తణుకు ఎస్కేఎస్ఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ మేళాలో గౌతమి సాల్వెంట్ ఆయిల్స్, ఇండస్ ఇండ్ బ్యాంకు, ముత్తూట్ ఫైనాన్స్, ఆక్సిస్ బ్యాంకు, అరబిందో ఫార్మా, అపోలో ఫార్మసీ వంటి ప్రముఖ కంపెనీలతోపాటు మరికొన్ని ఇతర కంపెనీల్లో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, సూపర్‌వైజర్, ఫార్మా అసిస్టెంట్, మెషిన్ ఆపరేటర్, లోన్ ఆఫీసర్ మొదలైన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. మొత్తం 500లకు పైగా ఉద్యోగావకాశాలు కల్పించే ఈ మేళాలో 18 నుంచి 35 సంవత్సరాల్లోపు యువతీ, యువకులు, మహిళలు, పురుషులు అర్హులని కంపెనీల నియమాలను అనుసరించి ఎంపిక చేస్తారని చెప్పారు. కావున నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరములకు విజయకుమార్ 9618560188, నాగేంద్ర 9502024765 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జిల్లా పరిషత్తు ఆస్తులను రీసర్వే చేయండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ ఘంటా పద్మ శ్రీ ప్రసాద్ శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను బొలిశెట్టి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పద్మశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా పరిషత్తు నిధులు నుంచి విడుదలైన పనులు పురోగతి, జిల్లా పరిషత్తు ఆస్తుల గురించి చర్చించారు. జిల్లా పరిషత్తు ఆస్తులను రీసర్వే చేయాలని శాసన సభ్యులను కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు ముత్యాల ఆంజనేయులు, నిడదవోలు జెడ్పీటీసీ సభ్యులు కొయ్యే సూర్యరావు తదితరులు పాల్గొన్నారు.

వరాల వెంకన్నకు విశేష పూజలు



అత్తిలి: మండలంలోని ఈడూరు గ్రామంలో వేంచేసి యున్న వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ జరిపారు. ఉదయం అర్చనలు, ప్రత్యేక పూజలు చేసి, స్వామివారిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేశారు.

రఘురామకృష్ణరాజు వ్యాఖ్యలపై నిరసన



పెంటపాడు: గేట్‌సెంటర్‌లో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు



తాడేపల్లిగూడెం(టీఓసీ): పట్టణంలో నిరసన ప్రదర్శన

పెంటపాడు: సీపీఎం కార్యదర్శి శ్రీనివాసరావుపై ఉండి ఎమ్మెల్యే రాఘురామకృష్ణరాజు చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పెంటపాడు గాంధీబొమ్మ సెంటర్‌లో శనివారం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన, ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండల కమిటీ కన్వీనర్ సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి బంకూరు నాగేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం పాలకోడేరు కాలువ వెంబడి అప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు 100 కుటుంబాలకు బిఫారం పట్టాలు ఇచ్చారన్నారు. అక్కడ వారు ఇల్లు నిర్మించుకొంటే పంచాయతీ వారు పైప్‌లైన్, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ విద్యుత్ కనెక్షలు ఇచ్చారన్నారు. ఎంతోకాలం నుంచి వారు అద్దె చెల్లించుకొని బ్రతుకు తున్నారన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడు వారిపై ఏ విధమైన ఆంక్షలు లేకుండా పరిపాలన సాగిస్తున్నారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు వారిపై జులుం ప్రదర్శించడం సరికాదన్నారు. వారి ఇళ్లను నేలమట్టం చేసేందుకు రాత్రి సమయంలో పోలీసు, రెవెన్యూ యంత్రాంగాలను పంపి ఇళ్లను నేలమట్టం చేసారన్నారు. ఒక పక్క 43 డిగ్రీల ఎండ, రాత్రి సమయంలో దోమలు, చలిలో పిల్లలు, వృద్ధులు పడగొట్టిన శిథిలాలలో కాపురాలు ఉంటున్నా ప్రభుత్వం కనికరించడం లేదన్నారు. ఇటువంటి దురదృష్టకరమైన సంఘటనను సీపీఎం పార్టీ ఖండిస్తే ఎమ్మెల్యే వారిపై అనుచిత వాఖ్యలు చేసి అవమాన పరిచారన్నారు. తిట్టినా, కొట్టినా కమ్యూనిస్టులు బెదిరిపోరన్నారు. ఉండి ఎమ్మెల్యే లా పార్టీలు మారే అలవాటు సీపీఎంకు లేదన్నారు. బాధితులకు న్యాయం జరిగేవరకు తాము పోరాడతామన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుపై అనుచిత వాఖ్యలు పట్ల తీవ్రంగా తాము ఖండిస్తున్నామన్నారు. ఉండి ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పెనగంటి దుర్గ, పైలి ప్రసాద్, పాలపర్తి కృష్ణ, పూడి బాలాజీ, వెన్నెల రామకృష్ణ, దత్తు రాము, సంకు వీరాస్వామి, మీసాల శ్రీను, చల్లా గోవిందరాజు, తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే కె.రఘురామకృష్ణరాజు అనుచిత వ్యాఖ్యలు సరికాదని, దూషిస్తూ, బెదిరిస్తూ మాట్లాడాన్ని వెనక్కి తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, సీపీఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణలు టీడీపీ, కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనం నుంచి పోలీస్ ఐలాండ్ వరకు సీపీఎం నాయకులు, సభ్యులు నిరసన ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ రఘురామకృష్ణరాజు ఎమ్మెల్యే అయిన తరువాత ఉండి నియోజకవర్గంలో ఉత్తరప్రదేశ్‌లో ఉన్నటువంటి బుల్డోజర్ రాజకీయాలను ఇక్కడ ప్రదర్శిస్తున్నట్లు విమర్శించారు. పేదల ఇళ్లను కూల్చివేసి అక్కడ ఉన్నటువంటి భూస్వాములకు మేలు చేసిన పనిలో పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. గొన్నాబత్తుల నాగేశ్వరరావు, నరమాల కృష్ణ, కాలపురెడ్డి కొండలరావు, వడిసెల శ్రీను, తోట శ్రీను, కె.వీర్రాజు, టి.శ్రీను, పి.నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన ఉద్రిక్తత

ఇరగవరం: మండలంలోని యర్రాయి చెరువు, తణుకు మండలంలోని వేల్పూరు శివారు యర్రాయి చెరువు గ్రామాల మధ్య శుక్రవారం రాత్రి నుంచి కొనసాగిన ఉద్రిక్తతలు శనివారం కూడా కొనసాగాయి. వేల్పూరూ శివారు యర్రాయి చెరువు గ్రామస్తులు శనివారం ఉదయం నుంచి ఇరగవరం వేల్పూరు ప్రధాన రహదారిపై మండుటెండలో బైఠాయించి నిరసనలు తెలిపారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడి సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ జానా సతీష్ తదితరులు ఉన్నారు.

భక్తులతో సోమేశ్వరుని ఆలయం కిటకిట

పెనుమంట్ర: మాస శివరాత్రి, శనిత్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం జుత్తిగ గ్రామంలో శ్రీఉమావాసుకి రవిసోమే శ్వరస్వామి, నవగ్రహ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సోమేశ్వర స్వామివారికి పంచామృత అభిషేకాలు, నవగ్రహ ఆలయంలో శనేశ్వరునికి తైలాభిషేకాలు, నిర్వహించి అనంతరం స్వామివార్లను దర్శించుకున్నారు. స్వామివారికి వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలకరించారు. ఈ సందర్భంగా జుత్తిగలోని సోమేశ్వర ఆలయం మహిళా భక్తులతో పోటెత్తింది. అదేవిధంగా శనివారం మార్టేరు లోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో కూడా స్వామివార్లకి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సొసైటీ కార్యదర్శి ఆత్మహత్య

ఇరగవరం: ఇరగవరం మండలంలోని సహకార సంఘం కార్యదర్శి ఒకరు శుక్రవారం ఉదయం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈయన మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సొసైటీ ఆన్‌లైన్ ప్రక్రియలో భాగంగా కొన్నాళ్లు ఆయన ఇంటి వద్దనే ఉంటూ ల్యాప్‌టాప్‌లో వివరాలు నమోదు చేసేవారని, రెండు రోజులకొకసారి కార్యాలయానికి వచ్చి అవసరమైన సంతకాలు పెట్టి వెళ్లిపోయేవారని సిబ్బంది తెలిపారు. ఆత్మహత్యకు చేసుకోవడానికి ముందు రెండు లేఖలు రాసినట్లు తెలుస్తోంది. అవి వెలుగులోకి వస్తే ఆత్మహత్యకు గల కారణాలు తెలిసే అవకాశం ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

30 లోపు ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలి

పెనుగొండ: రేషన్‌కార్డులు ఉన్న లబ్ధిదారులు ఈ-కేవైసీ తప్పనిసరిగా ఈ నెల 30 లోపు పూర్తి చేసుకోవాలని పెనుగొండ తహసీల్దారు జి.అనిత కుమారి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. లబ్ధిదారుల ఈ-కేవైసీ పెండింగ్ జాబితాలు రేషన్ డీలర్ల వద్ద ఉన్నాయని వివరించారు. పెండింగ్ ఉన్న వారందరూ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ-కేవైసీ పూర్తి చేయడానికి రేషన్ డీలర్లు, లబ్ధిదారులు, వీఆర్వోలు, వీఆర్ఏలు, ఎండీయూలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

28 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

అత్తిలి: ఈనెల 28 నుండి జూన్ 6వ తేదీ వరకు అత్తిలి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు అత్తిలి శాఖా గ్రంథాలయాధికారి డి కృష్ణారావు శనివారం తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయులు, వలంటీర్ల సహాయంతో విద్యార్థులకు పుస్తక పఠనం, క్రాఫ్, చిత్రలేఖనం వంటి అంశాలను నేర్పడంతో పాటు క్రీడల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. విద్యార్థులు ఈశిబిరంలో పాల్గొని సృజనాత్మకతను పెంపొందించుకోవాలని కోరారు.

ఆరవల్లిలో....

ఆరవల్లి శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి సత్తి శ్రీనివాసరెడ్డి తెలిపారు. విద్యార్థులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.